క్లుప్తంగా

నిబంధనలు అమలు చేయాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ ముద్దాడపేట ఇసుక రీచ్ నుంచి ఇసుక తరలింపులో నిబంధనలు అమలు చేయాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి కోరారు. ఈ మేరకు శ్రీకాకుళం పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసం ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. రీచ్‌లో ఇసుక అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

వర్మీ కంపోస్టు స్టాల్ సందర్శన



వర్మీ కంపోస్టు స్టాల్ పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో వర్మీ కంపోస్టు అమ్మకపు స్టాల్‌ను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సోమవారం సందర్శించారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతులమీదుగా వర్మీ కంపోస్టు ఎరువు కొనుగోలు చేశారు.

వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాత శ్రీకాకుళంలో సిక్ అండ్ సేవ్ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యేసు అర్థ చర్చి ప్రాంగణంలో క్రిస్మస్ సందర్భంగా పేద వృద్ధులు, మహిళలకు దుప్పట్లు, చీరల పంపిణీ జరిగింది. ముఖ్య అతిథిగా పాస్టర్ ఆర్.ప్రసాదరావు, సీనియర్ ఫిజియోథెరపిస్టు డాక్టర్ శ్రీనివాస పట్నాయిక్‌లు పాల్గొని మాట్లాడుతూ సేవా కార్యక్రమాలే క్రీస్తుసేవ అన్నారు. జెసీస్ గవర్నర్ పోలు మహంతి ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కర్నేని పద్మావతిలు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాధా రమాదేవి, కరకవలస వినీలాబాయి పట్నాయిక్, పాస్టర్ జుత్తుక ఐజాక్, పాస్టర్ లోపింటి మురళి, కర్నేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవరవలసలో రెవెన్యూ సదస్సు నేడు

జి.సిగడాం: మండలంలోని దేవరవలస గ్రామంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఉన్న రైతుల భూ సమస్యలను ఈ సదస్సుల ద్వారా పరిష్కారం చేస్తామన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరుద్ర నక్షత్ర పూజలు



పూజలందుకుంటున్న శివయ్య

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉన్న ఉమాజలలేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామికి అభిషేకార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అలంకరించారు.

ధనుర్మాస ప్రవచనాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో వెలసి ఉన్న శ్రీరంగనాథస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం నుంచి ధనుర్మాస వ్రత ప్రవచనాలు ప్రారంభించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు బొడ్డేపల్లి ముకుందరావు ఆధ్వర్యంలో, తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు సౌజన్యంలో నిర్వహిస్తున్నారు. రోజూ ప్రత్యేక పూజలు, మేలుకొలుపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సేవా ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

కూరగాయల సాగు.. ఆదాయం బాగు

- రబీలో ఆసక్తి చూపిస్తున్న రైతులు
- విత్తన ఎంపికే కీలకం
- సూచనలిస్తున్న అధికారులు



కేశవరావుపేటలో పండిస్తున్న క్యాబేజీ

ఎచ్చెర్ల:

రబీ సీజన్‌లోనూ కూరగాయల పంటలను సాగుచేస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా దుంపకూరలు, క్యాబేజీతో పాటు ఏడాదంతా వచ్చే మిరప, టమాట, వంగ పంటలు ఈ సీజన్‌లో సాగు ఎక్కువగా చేయడం వల్ల అధిక లాభాలు వస్తాయని ఉద్యాన నిపుణులు సూచిస్తున్నారు. ఖరీఫ్ పంటలతో పోల్చితే రబీలో దిగుబడులు ఎక్కువగా ఉంటాయని పేర్కొంటున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో లావేరు మండలంలోని కేశవరాయునిపాలేం, మురపాక, చిన్నమురపాక, పెద్దరావుపల్లి, వెంకటాపురం, ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేట, ఎస్ఎంపురం, ఫరీదుపేట, కుశాలపురం, కొత్తపేట, ఎచ్చెర్ల, చిలకపాలేం, జి.సిగడాం మండలంలోని ఆబోతులపేట, మెట్టవలస, పెంట, పాగిరి, పాలకండ్యాం, గేదెలపేట, రణస్థలం మండలంలోని కృష్ణాపురం, పాతరణస్థలం, నగరపాలేం, దేరసాం, సంచాం, కమ్మసిగడాం, కొండములగాం గ్రామాల్లో ఎక్కువగా కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. అయితే ఈ సాగుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కింతలమిల్లు వద్ద పండిస్తున్న టమాట



కేశవరావుపేట వద్ద మిరపపంట

మెలకువలు తప్పనిసరి

రబీలో కూరగాయల సాగులో నాణ్యమైన దిగుబడులు, తద్వారా అధిక నికర ఆదాయం పొందాలంటే రైతులు కొన్ని మెలకువలను పాటించాలి. నీరు ఉంటేనే సాగుకు సిద్ధం కావాలి. చీడపీడలను తట్టుకొని దిగుబడి ఇచ్చే రకాలను ఎంచుకోవాలి. ఆయా ప్రాంతాల్లో సిఫార్సు చేసిన వంగడాలనే సాగులో వేయాలి. రబీలో చలి ఎక్కువగా ఉండడం వల్ల సూక్ష్మధాతు పోషకాలు లోపించే అవకాశాలు ఎక్కువ, కాబట్టి అధికారుల సలహాలతో సూక్ష్మ ధాతు ఎరువులను సిద్ధం చేసుకోవాలి.

హైబ్రీడ్ విత్తనాలతో దిగుబడులు

కూరగాయల సాగులో హైబ్రీడ్ విత్తనాల వలన దిగుబడులు పెరుగుతాయి. అందువల్ల హైబ్రీడ్ విత్తనాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. అయితే నాణ్యత లేని విత్తనాలు మార్కెట్‌లో ఉండే అవకాశం ఉంది. కాబట్టి విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. విత్తనాలు విక్రయించే సంచిపై లేబుల్స్ ఉన్న ప్రమాణాలు, మొలక శాతం, వెన్ను స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత ఇతర వివరాలు పరీక్షిస్తే మంచిది.

నారు పెంపకం

విత్తన మొలక శాతం పరీక్షించిన తర్వాతే నారు మడులు పెంచుకోవాలి. గింజలను పేపర్‌లో వరుసగా పెట్టి పేపర్ చుట్టాలి. ఆ తర్వాత చీకట్లో ఉంచి ఉదయం, సాయంత్ర సమయాల్లో నీరు తడి చేయాలి. వంగ, టమాట విత్తనాలు 5 నుంచి 6 రోజులు, మిరప 10 నుంచి 11 రోజుల్లో మొలకెత్తుతాయి. ఆ తర్వాత 100 విత్తనాలకు ఎన్ని మొలకెత్తితే అంత శాతంగా నిర్ధారించుకోవాలి.

జాగ్రత్తలు వహించాలి

రైతులు కూరగాయలు పండించడానికి శీతాకాలం అనుకూలంగా ఉంటుంది. కాకపోతే కూరగాయల విత్తన ఎంపికపై జాగ్రత్తగా వ్యవహరించాలి. నాసిరకం విత్తనాలతో డబ్బు, శ్రమ వృథా అవుతాయి. ప్రభుత్వం గుర్తించిన కంపెనీల విత్తనాలనే ఉపయోగించాలి. విత్తన శుద్ధి చేయడం మరిచిపోకూడదు. కొనుగోలు సమయంలో విధిగా రశీదు తీసుకోవాలి. లైసెన్స్ ఉన్న విత్తన విక్రయ కేంద్రాల వద్దనే కొనుగోలు చేయాలి.

– సుదర్శిని, ఉద్యానవన శాఖ అధికారి, ఎచ్చెర్ల

అన్నప్రసాద వితరణ



శ్రీకాకుళం నగరంలోని పలుచోట్ల విశాఖ-బీ కాలనీలోని షిరిడి సాయి యోగా సమితి, కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా యోగా గురువు మురళి, ట్రస్టు ప్రతినిధి కొంక్యాన మురళీధర్‌రావులు మాట్లాడుతూ ఇళ్లలో జరిగే వేడుకల్లో అన్నం మిగిలితే వృథాగా బయటకు పారేకుండా, వాటిని వెనువెంటనే సేకరించి నిరుపేదలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో వినయ్‌స్వామి, ఉర్లం శివతేజ, కొంక్యాన శివశంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

విద్యార్థులకు అభినందన



రణస్థలం మండల కేంద్రంలోని రణస్థలం శ్రీపరశురామ యుద్ధ కళాక్షేత్రానికి చెందిన విద్యార్థులు ఇంటర్ స్కూల్ స్టేట్ పెన్‌కాక్ సిలాట్ కాంపిటీషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చారని కరాటే శిక్షకుడు లింగాల ఈశ్వరరావు తెలిపారు. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు ఆదివారం జరిగాయి. పోటీల్లో కళాక్షేత్రం నుంచి 22 మంది పాల్గొనగా, వివిధ కేటగిరిల్లో జరిగిన పోటీల్లో గోల్డ్-15, సిల్వర్-4, బ్రాంజ్-3 పతకాలు సాధించారని చెప్పారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

– రణస్థలం

అప్రమత్తత అవసరం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో లిఫ్ట్ ఎక్కుతున్నారా అయితే జాగ్రత్తగా ఉండాలి. ఇంజినీరింగ్, సైన్స్ మరికొన్ని కోర్సులు ఈ బ్లాక్‌లో నిర్వహిస్తున్నారు. నాలుగు అంతస్తుల బ్లాక్‌కు లిఫ్ట్ సౌకర్యం ఉంది. ఇటీవల ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ లిఫ్ట్‌లో ఇరుక్కున్నారు. ఎలక్ట్రీషియన్‌కు ఫోన్ చేయడంతో లిఫ్ట్ డోర్లు తొలగించి బయటకు తీశారు. ప్రిన్సిపాల్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ ఒకరు రెండుసార్లు ఇరుక్కున్నారు. మరోపక్క విద్యుత్ సరఫరా ఆగిపోతే బ్యాటరీలు ద్వారా పనిచేయాల్సి ఉండగా, ఈ బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. లిఫ్ట్ నిర్వహణ అధ్వానంగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. మరోపక్క దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు పాట్లు పడుతు న్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

పాల ధరలు వెంటనే పెంచాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ



మాట్లాడుతున్న సూర్యనారాయణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తగ్గించిన ఆవుపాల ధరలు వెంటనే పెంచాలని, విశాఖ డైరీ అవినీతిపై విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని సుందరయ్య భవన్‌లో సోమవారం వెలమల రమణ అధ్యక్షతన పాల రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ విశాఖ డైరీ యాజమాన్యం ఆవు పాల ధరలు లీటరకి రూ.3 తగ్గించి, దాణా ధరను పెంచడం దారుణమన్నారు. 2 సంవత్సరాల నుంచి రైతులకు ఇవ్వాల్సిన బోనస్ ఇవ్వడం లేదన్నారు. ఇన్సూరెన్స్ సక్రమంగా చెల్లించడంలేదని వీటిపై పాల రైతులు డిసెంబర్ 2వ తేదీన డైరీ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించడం జరిగిందని తెలిపారు. పాల రైతుల డిమాండ్స్ సాధనకు ఈనెల 27వ తేదీన గార మండలం నిజామాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాలో అందరూ పాల్గొనాలని కోరారు. సదస్సులో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రారావు, కె.మోహన్‌రావు, ఎం.ప్రసాద్, వెంకటరావు, ఎల్.కృష్ణమూర్తి, రాంబాబు, భాస్కరరావు, వాసు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆపాలి

- ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకి వినతి



ఛైర్మన్‌కు రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: ఎస్సీ కులాల వర్గీకరణకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, ఈ నేపథ్యంలో వర్గీకరణ చర్యలు వెంటనే ఆపాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తయినా ఇంకా దేశంలోని అనేక ప్రాంతాల్లో అంటరానితనం ఉందన్నారు. మొత్తం 59 కులాలు ఉన్నాయని, వారంతా ఒకే రకమైన వివక్షకు గురవుతున్నారని వివరించారు. ఇతర కులాల మాదిరిగా క్రీమీ లేయర్ వర్తింపజేయాలని కోరారు. షెడ్యూల్డ్ కులాల వారిని వర్గీకరణ పేరతో విభజించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా గణన, కుల గణన పూర్తైన తర్వాత వాస్తవ లెక్కల ఆధారంగా ఎస్సీ రిజర్వేషన్ శాతం పెంచాలని కోరారు. దళితులకి నాణ్యమైన ఆధునిక నైపుణ్యాలతో కూడిన విద్యను అందించేలా చూడాలన్నారు. అలాగే అర్హులైన దళితులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అన్నివిధాలుగా ప్రోత్సహించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, నాయకులు సింకు రమణ, పురుషోత్తం రాంబాబు, అప్పారావు, కుప్పిలి అప్పన్న, సుత్తి సంతోష్, లుట్ట సత్యనారాయణ, పెయ్యల చంటి, అరుబారిక రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు సంపూర్ణ మద్దతు

అలాగే ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సవలపురపు వెంకటరమణ అన్నారు. ఈ మేరకు మాదిగ ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని, అనేక సంవత్సరాల నుంచి ఎస్సీల్లోని అన్ని ఉప కులాలలకు సమాన న్యాయం జరగడం లేదన్నారు. కావున అన్ని కులాలకు న్యాయం జరిగేందుకు వర్గీకరణ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

వర్గీకరణతో తీవ్ర అన్యాయం

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పెంటరావు
- రణస్థలంలో మాలల సింహగర్జన



రణస్థలంలో ర్యాలీ నిర్వహిస్తున్న వర్గీకరణ వ్యతిరేక కమిటీ సభ్యులు



మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణతో షెడ్యూల్ కులస్తులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పాల్తెరు పెంటరావు, రాష్ట్ర నాయకుడు ప్రొఫెసర్ ఎన్‌డీఎల్ పాల్‌లు అన్నారు. మండల కేంద్రంలోని మాలల సింహగర్జనలో చలో రణస్థలం కార్యక్రమంలో భాగంగా భీమ్ భవన్ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అప్పలసూరి మాస్టారు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ సోమవారం చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ డీవీఎస్ నారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ రాష్ట్రపతి కల్పించుకుని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ ప్రతిపాదనను రద్దు చేయాలి కోరారు. వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ర్యాలీలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాటానికి మద్దతు తెలిపారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో షెడ్యూల్ కులాల ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ యువజన జేఏసీ ఛైర్మన్ శిర్ల శ్యామ్ సుందర్, సీనియర్ న్యాయవాది బొయిడి మురళి కృష్ణ, పాలఖండ్యం సీతారాం, పాండ్రంగి శ్రీను, ఏసీపీ శ్రీనివాసరావు, సంఘం నాయకులు సింక అప్పారావు, నేతల కృష్ణ, దండాసి జాన్, బంగారి, ఒమ్మి రవి, తాలాడ రమణ, ప్రేమ్‌కుమార్, యామల కృష్ణ, ఎస్.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీసీటీఏ కమిటీలో జిల్లాకు పెద్దపీట



డాక్టర్ పైడితల్లి



డాక్టర్ ఢిల్లీశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల రాష్ట్ర సంఘ నూతన కమిటీలో శ్రీకాకుళం జిల్లాకు పెద్దపీట లభించింది. విజయవాడ వేదికగా జరిగిన 37వ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో సంఘం రాష్ట్ర అకడమిక్ సెక్రటరీగా తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ డి.పైడితల్లి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, అలాగే జోన్-1 ప్రెసిడెంట్‌గా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఎస్.ఢిల్లీశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఏపీ జీసీటీఏ రాష్ట్ర బాధ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరి ఎన్నికపై జిల్లా జీసీటీఏ అధ్యక్షుడు డాక్టర్ కె.చక్రపతి, కార్యదర్శి డాక్టర్ ఎస్.రామకృష్ణ, జిల్లా స్థాయి, కళాశాల స్థాయి వివిధ కార్యవర్గ సభ్యులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

మర్యాదపూర్వక భేటీ



పి.వి.చావాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జాతీయ సఫాయ్ కర్మచారి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ పి.వి.చావా సోమవారం జిల్లాకు విచ్చేశారు. దీంతో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఒక ప్రైవేటు హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

వేలంపాట రేపు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక నారాయణ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజా సామగ్రి అమ్మే షాపుల వేలంపాట ఈనెల 18న ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆలయ ఈవో శ్యామలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల (2025-26)కు నిర్వహించే వేలంపాటలో పాల్గొనేవారు రూ.5 వేలు ప్రథమ ధరావత్తుగా చెల్లించాలని కోరారు.

అప్పాపురంలో క్రిస్మస్ వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని అప్పాపురం గ్రామంలో పాస్టర్ ఎస్.సురేష్‌ఐజిక్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎలిజిబిత్‌రాణి పాల్గొని దైవ సందేశం చేశారు. కార్యక్రమంలో రమణ మాస్టర్, ఉమా, గిరిరాజ్, జి.ఎస్ పాల్, రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు



జి.సిగడాం: సర్పంచ్‌లతో ప్రమాణం చేయిస్తున్న అధికారులు



రణస్థలం: మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో సత్యనారాయణ

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని వక్తలు అన్నారు. అన్ని మండల కేంద్రాల్లో సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సుస్థిర అభివృద్ధి సాధించే విధంగా యువత, ప్రజల సహకారంలో ముందుకు సాగాలని సూచించారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎంలు బాధ్యత వహించాలన్నారు. పారిశుద్ధ్య నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎచ్చెర్ల: మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకట్రాజు



శ్రీకాకుళం రూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ అంబటి నిర్మల



గార: మాట్లాడుతున్న పరిశీలకుడు నాగరాజు



ఎచ్చెర్ల: శిక్షణ ప్రారంభిస్తున్న ఎంపీపీ చిరంజీవి తదితరులు

ప్రారంభమైన ధనుర్మాస వ్రతాలు



నారాయణ తిరుమలలో ప్రత్యేక అలంకరణలో గోదాదేవి



శివకేశవ ఆలయంలో నెలగంటకు పూజలు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని పలు వైష్ణవ దేవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా సోమవారం ప్రారంభమయ్యాయి. నారాయణ తిరుమలలో ధనుర్మాసం సందర్భంగా వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేంకట రామానుజ సేవాదళం సభ్యులు పాల్గొన్నారు. అలాగే పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో ధనుర్మాసం సందర్భంగా నెలగంట పూజలు చేశారు. స్థానిక దీపామహల్ వెనుకనున్న బ్యాంకర్స్ కాలనీలోని శివ బాలాజీ ఆలయంలో, వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు జరిగాయి. పాత శ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. అదేవిధంగా డీసీసీబీ కాలనీలో వేంచేసిన భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మీ అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తిరుప్పావై పారాయణ జరిగింది.